నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, శుక్రవారం 17 మే 2024 SANGAREDDY

# తల్లీకొడుకును మింగిన కరెంట్




నీరుడి మణెమ్మ, నీరుడి భానుప్రసాద్ (ఫైల్)

- విద్యుత్‌షాక్‌తో ఉసిరికపల్లిలో ఇద్దరి మృతి
- ఇంటి ఆవరణలో బట్టలు ఆరేస్తుండగా ప్రమాదం
- పరామర్శించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట, మే 16: విద్యుత్‌షాక్‌తో తల్లీకొడుకు మృతి చెందిన ఘటన గురువారం శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహిపాల్‌రెడ్డి, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఉసిరికపల్లి గ్రామానికి చెందిన నీరుడి మణెమ్మ(45) గురువారం ఉదయం 6.30గంటల ప్రాంతంలో బట్టలు ఉతికి ఇంటి ఎదుట ఉన్న దండేనికి (జే వైర్)పై ఆరేస్తుండగా, రాత్రి కురిసిన వర్షానికి జే వైర్‌కు ఇంటి సర్వీస్ వైర్ తగిలి విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన మణెమ్మ మరిది కుమారుడు నీరుడి భానుప్రసాద్(19) ఆమెను కాపాడేందుకు ప్రయత్నించగా అతడికి కూడా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. అంతలోనే మణెమ్మ కూతురు శ్రీలత వచ్చి చూసే సరికి వారు కిందపడి ఉన్నారు. వారిని చూసి లేపే ప్రయత్నం చేయగా ఆమె కరెంట్ షాక్‌కు గురైంది. వెంటనే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వారిని తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అప్పటికే మణెమ్మ, భానుప్రసాద్ మృతి చెందారు. శ్రీలత స్వల్ప గాయాలతో బయటపడింది. మృతుడు భానుప్రసాద్ తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు.

**పరామర్శించిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి...**

ఉసిరికపల్లిలో జరిగిన అంత్యక్రియలకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. బీఆర్‌ఎస్ నాయకులు, మండల నాయకులు పరామర్శించారు. మృతుడు భానుప్రసాద్ బీఆర్‌ఎస్‌లో చురుగ్గా పనిచేశారని గుర్తుచేశారు. ఎమ్మెల్యేతోపాటు స్థానిక నాయకులు రూ.25 వేలు, జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా రూ.10వేలు, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ రూ.8వేలు ఆర్థికసాయం అందజేశారు. ఎమ్మెల్యే వెంట బాబూరావు, రమణాగౌడ్, సిలువేరి వీరేశం, తూము కృష్ణారావు, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు ఉన్నారు.



నాయకులతో కలసి బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# రూ.కోటి దాటిన కొమురవెల్లి హుండీ ఆదాయం

చేర్యాల, మే 16: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి హుండీలను గురువారం ఆలయంలో లెక్కించారు. 45 రోజుల్లో రూ.1,16,51,672 ఆదాయం ఆలయానికి సమకూరింది. ఆలయ ఈవో బాలజీ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెకర్ రంగారావు పర్యవేక్షణలో ఆలయ మహా మండపంలో హుండీలు లెక్కించారు. ఆలయ అర్చకులు, ఉద్యోగులు, తాత్కాలిక సిబ్బంది, రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు 260 మందితో లెక్కించారు. ఈ లెక్కింపులో రూ.1,16,51,672 నగదుతోపాటు 70 గ్రాముల మిశ్రమ బంగారం, 10కిలోల మిశ్రమ వెండి, 23 క్వింటాళ్ల బియ్యం, 18 ఇతర దేశాల కరెన్సీ వచ్చాయి. నగదును స్థానిక ఏపీజీవీబీలో జమచేసినట్లు ఈవో తెలిపారు. లెక్కింపులో ఆలయ ఏఈవోలు గంగాశ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్,ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.



లెక్కింపులను పర్యవేక్షిస్తున్న ఆలయ ఈవో, ప్రధానార్చకుడు, ఇన్‌స్పెక్టర్

# రైతులను నమ్మించి ముంచిన కాంగ్రెస్

- దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి
- వేగంగా ధాన్యం కొనాలి
- కొన్న ధాన్యాన్ని వేగంగా మిల్లులకు తరలించాలి
- కేసీఆర్ పాలనలో సుభిక్షం.. రేవంత్ పాలనలో దుర్భిక్షం
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, మే 16: కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, రేవంత్‌రెడ్డి పాలనలో దుర్భిక్షంగా మారిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో గురువారం నర్సాపూర్ పట్టణంలో బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులు ధర్నా, రాస్తారోకో చేపట్టారు. నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి భారీ సంఖ్యలో అంబేద్కర్ చౌరస్తాకు ర్యాలీగా బయలుదేరి చౌరస్తాలో మానవహారం నిర్వహించి ధర్నా, రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నమ్మించి మోసం చేసిందన్నారు. ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చి నేడు సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని కొర్రీలు పెట్టడం తగదన్నారు. సన్న వడ్లతోపాటు దొడ్డు వడ్లకూ రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. 90 శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండించారని, ఇచ్చిన హామీ ప్రకారం వారికి బోనస్ చెల్లించాలన్నారు. సర్కారు నిర్లక్ష్యంతో వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తిందని, రైస్‌మిల్లుల్లో ధాన్యాన్ని దించుకోక వందల లారీలు పడిగాపులు కాస్తున్నాయని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని త్వరగా తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించి రైతుల ఖాతాల్లో వేగంగా డబ్బులు జమ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రైతులకు ఆపద కలిగితే ఏ సమయమైన ఉద్యమిస్తామని, వారికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని మనోధైర్యాన్ని కల్పించారు. కేసీఆర్ పిలుపు మేరకు అధికసంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతం చేసినందుకు బీఆర్‌ఎస్ శ్రేణులకు, రైతులకు సునీతాలక్ష్మారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీకోఆప్షన్ సభ్యుడు మన్సూర్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సింగాయిపల్లి గోపి, సత్యం గౌడ్, వైస్‌ఎంపీపీ వెంకటనర్సింగరావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణాధ్యక్షుడు భిక్షపతి, మండలాల అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సూరారం నర్సింహులు, రాజేశ్, ప్రసాద్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో మానవహారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు



నర్సాపూర్‌లో ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులు

# దేశంలోనే అట్టర్‌ఫ్లాప్ సీఎం రేవంత్

## రైతు ధర్నాలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ ఎదుట రైతు ధర్నాలో పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, మే 16: ప్రజలకు మంచి పాలనను అందించడంలో సీఎం రేవంత్‌రెడ్డి అట్టర్‌ఫ్లాప్ అయ్యారని, ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను గాలికొదిలేశారని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం చేపట్టిన ధర్నాలో రైతులనుద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలతో ప్రజలకు నష్టమే తప్ప లాభం లేదన్నారు. రైతులకు, ప్రజల పక్షాన నిలబడేది కేసీఆర్ మాత్రమేనన్నారు. త్వరలోనే గజ్వేల్ నియోజవర్గంలోని అన్ని మండల కేంద్రాలు, రాజీవ్ రాహదారిపై రైతులతో పెద్ద ఎత్తున ధర్నా చేపడుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, పీఏసీఎస్ చైర్మన్ జెజాల వెంకటేశం గౌడ్, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అరుణ, కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, రజిత, కనకయ్య, రవీందర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మద్ది రాజిరెడ్డి, గొడుగు స్వామి, స్వామిచారి, ఆకుల దేవేందర్, ఎల్లయ్య, బాల్‌రాజు, కొమురయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

నిజాంపేట, మే 16: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా నిజాంపేటలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది.



ఎల్లయ్య(ఫైల్)

పోలీసులు కథనం ప్రకారం.. నిజాంపేట గ్రామానికి చెందిన గెరుగంటి ఎల్లయ్య (45) తనకున్న మూడు ఎకరాల వ్యవసాయ భూమిలో ఈ యాసంగిలో వరి పండించాడు. ఈయేడు భూగర్భజలాలు అడుగంటి బోర్లు నుంచి సరిపడా నీరందక పంట పూర్తిగా ఎండిపోయి రూ.4 లక్షల మేర అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కనబడక తీవ్ర మనోవేదనకు గురైన ఎల్లయ్య బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేనిది చూసి ఇంటి ముందు ఉన్న వేప చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నిజాంపేట ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మృతు డు గెరుగంటి ఎల్లయ్యకు భార్య వరలక్ష్మితో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఒక కుమార్తె డిగ్రీ, మరో కుమార్తె తొమ్మిదో తరగతి చదువుతున్నది.

## సర్కారు మెడలు వంచి

# హామీలు అమలు చేయిస్తాం

- ఈ సర్కార్‌కు రైతుల ఉసురు తగులుతుంది
- అన్ని రకాల వడ్లకు బోనస్ ప్రకటించాలి
- అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్
- జోగిపేటలో రైతులకు మద్దతుగా ధర్నా

అందోల్, మే 16: రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతున్నదని, రేవంత్ సర్కారుకు రైతుల ఉసురు తప్పక తగులుతుందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. వడ్లకు బోనస్ విషయంలో ప్రభుత్వ తీరుకు నిరసనగా గురువారం జోగిపేటలోని హన్‌మాన్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ శ్రేణులు, రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చంటి క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఆరు నెలల్లోనే తెలంగాణను దుర్భిక్షంగా మార్చిందన్నారు. రైతులు ఆరుగాలం కష్టంచి పండించిన ధాన్యాన్ని సైతం కొనలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. రైతులు రోడ్లపై, కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాసే పరిస్థితి వచ్చిందన్నారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామంటే సహించమని, రైతుల నోట్లో మట్టి కొట్టాలని చూస్తే కాంగ్రెస్ సర్కారుకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రైతులెవ్వరూ అధైర్యపడొద్దని, మీకు అండగా బీఆర్‌ఎస్ ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ మెడలు వంచి హామీలు అమలయ్యేలా కృషిచేస్తామని క్రాంతికిరణ్ అన్నారు. ఆందోళనలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు శ్రీధర్, మాజీఎంపీపీ రామాగౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ నాగభూషణం, నాయకులు వీరప్ప, విజయ్‌కుమార్, శివకుమార్, విఠల్, బుచ్చయ్య, సంతోష్, లింగాగౌడ్, వెంకటేశం, సాయికుమార్, రమేశ్, మొగులయ్య, శంకరయ్య, శ్రీనివాస్, విజయ్‌కుమార్, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.



అందోల్: జోగిపేట ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, పార్టీ శ్రేణులు

# బోనస్ అంటూ బోల్తా కొట్టించిన సర్కారు



దుబ్బాకలో బస్టాండ్ వద్ద ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు, రైతులు

- సన్న వడ్లకే బోనస్ అంటూ మాటమార్చిన సీఎం
- యాసంగిలో సన్న వడ్లు పండని విషయం సీఎంకు తెలువదా..?
- వడ్లకు బోనస్ ఇచ్చే వరకూ ఆందోళనలు ఆగవు
- రైతు సంక్షేమమే బీఆర్‌ఎస్ లక్ష్యం
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి
- దుబ్బాకలో రైతులతో కలిసి ధర్నా

దుబ్బాక, మే16: పండించిన ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం సన్నాలకు మాత్రమే ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాటమార్చడం రైతులను మోసం చేయడమేనని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికలకు ముందు ఒక మాట..ఎన్నికల తర్వాత మరొక మాటతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా ముంచిందని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం దుబ్బాక బస్టాండ్ వద్ద రైతు లు, బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వడ్లకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ...మోసం చేయడమే కాంగ్రెస్ నైజం అని విమర్శించారు. యాసంగిలో రైతు లు సన్న వడ్లు పండిస్తారా అనే విషయం సీఎంకు అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వ విధానాలు గత సమైక్యాంధ్ర పాలనను గుర్తు చేస్తున్నాయని విమర్శించారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. నిరసనలో జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, నాయకులు రొట్టే రాజమౌళి, కొత్త కిషన్‌రెడ్డి, గన్నే భూంరెడ్డి, వంశీకృష్ణగౌడ్, ఇల్లేందుల శ్రీనివాస్, నారాగౌడ్, బండి రాజు, బీమాసేనా, లచ్చ య్య, రవి, రాజు, నరేశ్, రైతులు పాల్గొన్నారు.

# బోనస్ పేరుతో కాంగ్రెస్ బోగస్ హామీ



నారాయణఖేడ్‌లోని రాజీవ్‌చౌక్ వద్ద రైతుదీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

- రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ నిరంతర పోరాటం
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి
- కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై నారాయణఖేడ్‌లో రైతుదీక్ష

నారాయణఖేడ్, మే 16: అసెంబ్లీ ఎన్నికల సమయంలో క్వింటాల్ వరికి రూ.500ల చొప్పున బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు మాట మార్చి సన్నాలకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించడం బోగస్ హామీ ఇచ్చామని ఒప్పుకున్నట్లేనని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతువ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం నారాయణఖేడ్‌లోని రాజీవ్‌చౌక్ వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతుదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. రైతులకు రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పెట్టుబడి సాయం కూడా సరిగ్గా ఇవ్వని పరిస్థితుల్లో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా 72 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిందని తెలిపారు. ప్రతి పంటనూ కొనుగోలు చేసి రైతులను అండగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణలో తీవ్ర నిర్లక్ష్యం చేయడమే కాకుండా తడిసిన వడ్లను కొనకుండా ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వం వడ్లను సకాలంలో కొనుగోలు చేయని కారణంగానే పెద్దశంకరంపేట మండలం రామోజిపల్లిలో ఇటీవల తాత, మనవడు పిడుగుపాటుకు గురై మృతిచెందారని, దీనిని ప్రభుత్వ హత్యగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు.

సాగునీటి కల్పనపై దృష్టి పెట్టకుండా ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ, బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని రద్దు చేయడంతో పాటు నల్లవాగు ప్రాజెక్టు, కాళేశ్వరం 19వ ప్యాకేజీ పనుల విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని తెలిపారు. ఆందోళనలో జడ్పీ కోఆప్షన్ సభ్యుడు అలీ, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు పరమేశ్, సంజీవ్‌రావు, గంగారాం, నగేశ్, ఎంపీపీలు మహిపాల్‌రెడ్డి, జంగం శ్రీనివాస్, జడ్పీటీసీలు నర్సింహారెడ్డి, విజయరామరాజు, నాయకులు నవాబ్, సత్యపాల్‌రెడ్డి, దిలిప్‌కుమార్, ఎంఏ. బాసిత్, పార్శెట్టి సంగప్ప, నారాయణరావు, సంగారెడ్డి, ఉబేద్, దుర్గయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

# రైతులకిచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

- రైతులను మోసం చేయడం కాంగ్రెస్ సర్కారుకు తగదు
- సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డి
- సంగారెడ్డిలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన, ర్యాలీ
- ఆర్డీవో వసంతకు వినతిపత్రం అందజేత



సంగారెడ్డిలో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు

సంగారెడ్డి, మే 16: అసెంబ్లీ ఎన్నికలప్పుడు కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేసి మాట నిలబెట్టుకోవాలని సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు గురువారం సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. కొత్త బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను వీడాలన్నారు. అధికారంలోకి రాగానే వరికి బోనస్ రూ.500లు ఇస్తామన్న హామీ ఇప్పుడు సాధ్యం కాదని అనడం సరికాదన్నారు. ఏడాదికి ఒక ముఖ్యమంత్రిని మార్చే సంస్కృతి కాంగ్రెస్‌లో ఉన్నదని, ఆగస్టులో ప్రభుత్వంలో ప్రకంపనలు ప్రారంభమవుతాయని జోస్యం చెప్పారు. అందుకే సీఎం ఏమి మాట్లాడుతున్నారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. రైతు పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం చేస్తుందని జడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి తెలిపారు. నిరసనలో కంది జడ్పీటీసీ కొండల్‌రెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కోడూరి రమేశ్, మల్లన్న, మనోహర్‌గౌడ్, వరలక్ష్మి, వెంకటేశ్వర్లు, పాండు, చక్రపాణి, ఆంజనేయులు, మధుసూదన్‌రెడ్డి, రఘు, ఇంద్రారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పుల్లారెడ్డి, రుక్మొద్దీన్, ప్రేమానందం, వరకుమార్, శ్రావణ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి

- ధాన్యానికి రూ. 500 బోనస్ ఇవ్వాలి
- మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్
- కలెక్టరేట్‌లో రైతులతో కలిసి వినతిపత్రం అందజేత

మెదక్ మున్సిపాలిటీ, మే 16: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అన్నిరకాల ధాన్యానికి బోనస్ ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగ వ్యతిరేక చర్యలకు నిరసనగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు బీఆర్‌ఎస్ నాయకులు బట్టి జగపతి, మామిళ్ల ఆంజనేయులు, సోములు, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జగన్ తదితరులతో కలిసి గురువారం మెదక్ కలెక్టరేట్‌లో ఆదనపు కలెక్టర్ రమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అకాల వర్షాలకు తడిసి ముద్దయిన ధాన్యాన్ని షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి రూ. 500 బోనస్ వెంటనే ఇవ్వాలన్నారు. వ్యవసాయానికి సరిగ్గా కరెంట్ ఇవ్వకుండా అన్నదాతను ఏడిపించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు పండించిన పంటను సకాలంలో కొనుగోలు చేయకుండా గోస పెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కారు రైతు వ్యతిరేక విధానాలను ఎండగడతామని తెలిపారు. రైతులకు రైతుబంధు, రైతు భరోసా ఇవ్వకుండా అన్ని రకాలుగా కాంగ్రెస్ మోసం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మాయ మల్లేశం, బాలరాజు, పేర్క కిషన్, పవన్, నర్సింహారెడ్డి, రమేశ్, యాదగిరి, గోపాల్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.



మెదక్ కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు